సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ၊ 21 ၊ ఫిబ్రవరి ၊ 2023



సోమశిలలో 63.731 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 63.731 టీఎంసీలు ఉన్నాయి. 428 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పెన్నార్ డెల్టాకు 1920, ఉత్తరకాలువకు 700, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.58,380
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,215
3 శాతం జీఎస్టీతో	రూ.5,371
సవర (8 గ్రా)	రూ.42,968

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.9 /23.3

జిల్లాలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ 72 శాతం ఉంది.

న్యూస్‌రీల్

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న దామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో సోమవారం రెండు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్లు చెప్పారు. ఇందులో భాగంగా 1వ యూనిట్లో 390 మెగావాట్లు, 2వ యూనిట్లో 350 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాలతో 3వ యూనిట్లో ఉత్పత్తి నిలిపివేశామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్



దీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ప్రాక్టికల్స్ పరీక్షలను తనిఖీ చేస్తున్న ఆర్ఐఓ వరప్రసాదరావు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ విద్యార్థులకు సోమవారం ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. జిల్లాలో మొత్తం 11 కేంద్రాల్లో ప్రాక్టికల్స్ జరిగాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండు విడతల్లో ప్రాక్టికల్స్‌ను నిర్వహించారు. ప్రాక్టికల్స్‌కు ఉదయం 582 మందికి 537 మంది, మధ్యాహ్నం నుంచి జరిగిన ప్రాక్టికల్స్‌కు 565 మందికి 535 మంది హాజరయ్యారు. నగరంలోని డీకేడబ్ల్యూ, జీవీఆర్ఆర్, ముత్తుకూరులోని నారాయణ తదితర జూనియర్ కళాశాలల్లో ఆర్ఐఓ వరప్రసాదరావు, డీవీఈఓ మధుబాబు ప్రాక్టికల్స్ పరీక్షలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టానికి పట్టం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బొకే అందిస్తున్న మేరిగ మురళీధర్, చిత్రంలో ఎమ్మెల్యే వరప్రసాద్

- స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మేరిగ మురళీ
- ఎస్సీ సామాజిక వర్గానికి న్యాయం

సాక్షిప్రతినిధి,నెల్లూరు: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ విజయానికి పడిన కష్టానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టం కట్టారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మేరిగ మురళీని ప్రకటించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికలో జిల్లాలో ఎస్సీ సామాజిక వర్గానికి పార్టీ పెద్ద పీట వేసింది. ఈ మేరకు సోమవారం తాడేపల్లి కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. మేరిగ ప్రస్తుతం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల్లో ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్ పర్సన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్ తదితర స్థానాలను వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేసిన నేపథ్యంలో ఎమ్మెల్సీగా గెలుపొందడం లాంఛనమే. మేరిగ మురళీ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో అనేక క్రియాశీలక బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి నేతలను ఒకేతాటిపై నడిపించేందుకు వారిని సమన్వయం చేసుకుంటూ కలిసి పనిచేశారు. 2014లోనూ గూడూరు టికెట్ మేరిగకే వస్తుందనుకున్న తరుణంలో పాశం సునీల్‌కు అవకాశం కల్పించాల్సి వచ్చింది. పాశం మధ్యలో పార్టీ ఫిరాయించడంతో 2016 నుంచి 2019 వరకు గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా వ్యవహరించారు. 2019 ఎన్నికల్లో ఆయనకే పార్టీ టికెట్ లభిస్తుందనుకున్న సమయంలో రాజకీయ సమీకరణాల నేపథ్యంలో అనూహ్యంగా గూడూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వరప్రసాద్‌ను ప్రకటించాల్సి వచ్చింది. అయినప్పటికీ మేరిగ ఎక్కడా అసంతృప్తి వ్యక్తం చేయకుండా పార్టీ ఆదేశాల మేరకు పనిచేశారు. గూడూరు నియోజకవర్గం అభ్యర్థి విజయానికి తనవంతుగా అహర్నిశలు కష్టపడ్డారు. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు, తిరుపతి ఉప ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల విజయానికి కష్టపడ్డారు. ఆ తర్వాత కాలంలో కార్పొరేషన్ చైర్మన్లను ప్రకటించినప్పుడు మేరిగకు రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. తాజాగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో ఎస్సీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇస్తూ మేరిగ మురళీకి అవకాశం కల్పించారు. నమ్మకానికి, కష్టానికి ఫలితం ఉంటుందని మేరిగ మురళీ ఉదంతమే నిదర్శనం. ఎమ్మెల్సీగా ఆయన ఎన్నిక లాంఛనమే.

మేరిగ మురళీ బయోడేటా

జననం	:	23 మే 1969
స్వగ్రామం	:	రాపూరు
తండ్రి	:	మేరిగ ఆనందరావు
తల్లి	:	మేరిగ సుందరమ్మ
విద్యార్హత	:	ఎంఏ (పోస్టు గ్రాడ్యుయేట్) ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి

రాజకీయ కుటుంబ నేపథ్యం : పెద్దనాన్న మేరిగ రామకృష్ణయ్య 1973లో గూడూరు నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా పనిచేశారు.

- 1983లో కాంగ్రెస్ నుంచి నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు.
- మేరిగ మురళీ 1995లో రాపూరు జెడ్పీటీసీగా పనిచేశారు.
- 2013-14 వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా పనిచేశారు.
- 2016-19 వరకు గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు.
- 2021 నుంచి స్టేట్ ఫైనాన్స్‌కార్పొరేషన్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

మరువలేని నేత.. సదాస్మరామి



విస్తృత ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



ఏర్పాట్లపై స్థానికులతో చర్చిస్తున్న విక్రమ్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి

- నేడు మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి

మర్రిపాడు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో నిర్వహించనున్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆకస్మికంగా మృతి చెంది ఏడాది అయినా ఇంకా జనం గుండెల్లో గూడుకట్టుకుని ఉన్నారు. మరువలేని నేతను.. మరోసారి స్మరించుకునేందుకు భారీగా అభిమానులు వర్ధంతి కార్యక్రమానికి తరలిరానున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని పలువురు ప్రముఖులతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని మేకపాటి అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా హాజరుకానున్నారు. ముందుగా మేకపాటి గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.30

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్: లైవ్	రూ.114
లేయర్ లైవ్	రూ.75
బ్రాయిలర్ చికెన్:	రూ.200
స్కిన్‌లెస్ చికెన్:	రూ.224
లేయర్ చికెన్:	రూ.128

నయన మనోహరం..
రథోత్సవం

- రథంపై విహరించిన శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి
- పరమేశ్వరుని నామస్మరణతో హోరెత్తిన మూలాపేట
- ఆది దంపతులకు నీరాజనాలు అర్పించిన భక్తులు

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మూలాపేటలోని శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి వారి రథోత్సవం సోమవారం నయనమనోహరంగా సాగింది. స్వామి వారు అమ్మవారితో కలిసి విశేష అలంకారంలో రథంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. భక్తులు కనులారా దర్శించుకుని దేవదేవులకు ప్రణమిల్లారు. ఓం నమఃశివాయ.. హరహర మహాదేవ శంభోశంకర నామ స్మరణతో మూలాపేట హోరెత్తింది. భక్తిగీతాలు, మంగళ వాయిద్యాలు, బ్యాండ్‌మేళాలు, యువత కేరింతల నడుమ దాదాపు మూడు గంటల పాటు రథోత్సవం నిర్వహించారు. భక్తులు రథచక్రాలపై ఉప్పు, మిరియాలు చల్లుతూ, గుమ్మడికాయలు, టెంకాయలు సమర్పించి కర్పూర హారతులిచ్చారు. భువనేశ్వరి మూలస్థానేశ్వరులకు భక్తులు సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లిస్తూ నీరాజనాలు పలికారు.

శాస్త్రోక్తంగా పూజలు

రథోత్సవంలో భాగంగా భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు, వేదపండితులు ఆలయంలో తొలుత శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిపై కొలువుదీర్చి రథమండపం వద్దకు తీసుకొచ్చారు. రథమండపం వద్ద పూజలు నిర్వహించి తదుపరి రథంపైకి వేంచేపు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొని రథాన్ని లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవం దేవస్థానం నుంచి బ్రాహ్మణవీధి, ఆర్‌ఎస్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాల, పొట్టిశ్రీరాములు బొమ్మ కూడలి, అలంకార్ సెంటర్, రాజాగారివీధి, రావిచెట్టుసెంటర్ నుంచి దేవస్థానం వద్దకు మధ్యాహ్నం 1.15 గంటలకు చేరింది. రథోత్సవం సందర్భంగా భక్తులకు దాతలు, పలు సంస్థల ప్రతినిధులు శీతల పానీయాలు, మజ్జిగ, పానకం, పలు రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు.



భక్తుల జయజయధ్వానాల నడుమ ముందుకుసాగుతున్న మూలస్థానేశ్వర స్వామి రథోత్సవం, ప్రత్యేక అలంకరణలో భక్తులను కటాక్షిస్తున్న భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి(ఇన్‌సెట్‌లో..)



స్వామి, అమ్మవార్లను పల్లకిపై రథం వద్దకు తీసుకువస్తున్న భక్తులు

మద్యం దుకాణంలో నగదు గల్లంతు

- అజ్ఞాతంలో సేల్స్‌బాయ్
- పోలీసులకు ఫిర్యాదు

మనుబోలు: స్థానిక బీసీకాలనీలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో సుమారు రూ.6 లక్షల నగదు గల్లంతయినట్లు సమాచారం. కాగా మద్యం దుకాణం నిర్వహించే సేల్స్ బాయ్ అజ్ఞాతంలో ఉన్నాడు. శని, ఆదివారాలు రెండు రోజులు సెలవు కావడంతో సోమవారం కలెక్షన్ బ్యాంకులో డిపాజిట్ చేయాల్సి ఉంది. శుక్ర, శని, ఆది వారాల కలెక్షన్ రూ.5,80,950లను మద్యం దుకాణం సూపర్‌వైజర్ అనిల్ సోమవారం ఉదయం సేల్స్‌బాయ్‌కు ఇచ్చి బ్యాంకులో డిపాజిట్ చేయాలని చెప్పినట్లు తెలిసింది. అయితే సేల్స్‌బాయ్ నగదుతో పరారైనట్లు సమాచారం. ఫోన్ చేయగా ఉదయం ఒకసారి మాత్రం తాను ఆస్పత్రిలో ఉన్నానని, వచ్చి నగదు కడతానని చెప్పాడని, ఆ తరువాత ఫోన్ తీయకపోవడంతో ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

25న జెడ్పీ స్థాయీసంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలు ఈ నెల 25న పొదలకూరు రోడ్డులోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈఓ చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రణాళిక - ఆర్థిక విషయాల స్థాయీసంఘ సమావేశం, గ్రామీణాభివృద్ధి స్థాయీసంఘ సమావేశం, వ్యవసాయ విషయాల స్థాయీసంఘ సమావేశం, పనుల విషయాల స్థాయీసంఘ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు విద్య, వైద్య ఆరోగ్య స్థాయీసంఘ సమావేశం, స్త్రీశిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం తదితర మూడు స్థాయీసంఘ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఆర్థిక పరమైన అంశాలకు తావివ్వకుండా సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్థాయీసంఘ కమిటీల సభ్యులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని సకాలంలో సమావేశంలో పాల్గొనాలని కోరారు. అలాగే ఆయా శాఖల జిల్లా అధికారులు సైతం హాజరు కావాలని తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఒక నామినేషన్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సోమవారం ఒక నామినేషన్ దాఖలైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి నీలం శామ్యూల్‌మోసెస్ నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నామినేషన్ పత్రాన్ని స్వీకరించారు. ఇప్పటి వరకు మూడు నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులు వెల్లడించారు. ఈ నెల 23వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంది. బుధ, గురువారాల్లో ఎక్కువ మంది నామినేషన్లు వేసే అవకాశం ఉంది.

జేడీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(సెంట్రల్): పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు సోమవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఆయన దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి జేడీగా కావలి డిప్యూటీ డైరెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. కాగా తిరిగి జేడీగా బాధ్యతలు చేపట్టినట్లు మహేశ్వరుడు తెలిపారు.